


ఎమ్మెల్యే డిసౌజా, మిథున్ రైకి నోటీసులు

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల మంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వచ్చిన సమయంలో నాయకులకు అనుకూలంగా నినాదాలు చేసిన మేరకు ఎమ్మెల్యే డిసౌజా, యూత్ కాంగ్రెస్ నేత కామిథున్ రైకి శుక్రవారం నోటీసులు జారీ అయ్యాయి. కాబోయే సీఎం డీకే శివకుమార్ అంటూ మిథున్ రై నినాదాలు చేయగా, ఐదేళ్ల పాటు సిద్దరామయ్య సీఎంగా అంటారంటూ ఎమ్మెల్యే డిసౌజా కేకలు వేశారు. కేసీ వేణుగోపాల్ సమక్షంలోనే నినాదాలు చేయడంతో ఆయన తీవ్రంగా పరిగణించారు. ఇద్దరికీ నోటీసులు జారీ చేశారు.



శుభ్రతా పనుల్లో సిబ్బంది



చలో బెళగావి

● శీతాకాల సమావేశాలకు సిద్ధమైన సువర్ణసౌధ ● బెంగళూరు నుంచి తరలిన నేతలు ● 12వేలమంది ఉద్యోగులు.. 3వేల గదులు



సిద్ధమయిన సభా వేదిక

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శీతాకాల సమావేశాలకు సువర్ణసౌధ సిద్ధమైంది. సోమవారం జరగనున్న సభా కలాపాలకు బెంగళూరు నుంచి అధికారులు, ఉద్యోగులు శుక్రవారం తరలివెళ్లారు. శాసనసభ, విధానపరిషత్ ఉద్యోగులు, సిబ్బంది ఈ ప్రారంభంలోనే బెళగావికి చేరుకుని అవసరమైన సౌకర్యాలు సిద్ధం చేసుకుంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి కార్యదర్శులతోపాటు ఉద్యోగులు, సిబ్బంది 12వేలమంది బెళగావికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అధికారులు, సిబ్బంది కొరకు 3వేల గదులను ఏర్పాటు చేశారు. అందరికీ భోజన వసతి కల్పించనున్నారు. శాసనసభలో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా 8వేలమంది పోలీసు సిబ్బందిని నియమించారు. ప్రతిరోజూ 25 నుంచి సుమారు 100 దాకా ఆందోళనలు జరగవచ్చునని, అందుకు తగిన విధంగా షామియానాలు సిద్ధం చేస్తున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షించాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. మరోవైపు శాసనసభ, పరిషత్ కీలకమైన మార్షల్స్ కూడా బెళగావికి తరలివెళ్లారు.

కత్తులు నూరుతున్న ప్రతిపక్షాలు

శాసనసభ సమావేశాల్లో అధికార కాంగ్రెస్ పార్టీని ముప్పుతిప్పలు పెట్టేందుకు ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ప్రత్యేక సమావేశం నిర్వహించి శాసనసభ్యులకు, పరిషత్ సభ్యులకు ముఖ్యనేతలు కుమారస్వామి, అశోక్, విజయేంద్ర తదితరులు దిశానిర్దేశం చేశారు. ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి, ప్రభుత్వ అవినీతితోపాటు ఇటీవల కొనసాగిన పలు ప్రజావ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాటం చేయాలని నిర్ణయించారు. కాగా శాసనసభలో సభ్యులు వ్యవహరించాల్సిన విధానాలపై మంత్రులతో సీఎం సిద్దరామయ్య గురువారం ప్రత్యేక సమావేశం జరిపారు. కలాపాలలో అందరూ పాల్గొనాలని సూచించారు.



తనిఖీలు చేస్తున్న పోలీసు


ప్రత్యేక బడ్జెట్‌తోనే అభివృద్ధి

● ప్రత్యేక రాష్ట్రం కన్నా అదే మేలు ● ఈ సమావేశాల్లో తర్మానించాల్సిందే ● ఉత్తర కర్ణాటక నేతల డిమాండ్

బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక పట్ల దశాబ్దాలకాలంగా సవతితల్లి ప్రేమ చూపుతున్నారని ఏటా బెంగళూరు ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో కొంతమేర కూడా సాధ్యం కావడం లేదనే డిమాండ్ కొన్నేళ్లకాలంగా సాగుతోంది. ఇదే తరహాలో కొనసాగిస్తే ఉత్తర కర్ణాటక ప్రత్యేక రాష్ట్రం కోరుతామని పోరాటాలు సాగాయి. ఈ పరిణామం తీవ్రరూపం దాల్చడంతో సమైక్య కర్ణాటక ఉండాలనే దశాబ్దన్నర కాలంకిందటే బెళగావిలో సువర్ణసౌధ నిర్మించారు. ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు సువర్ణసౌధలో కొనసాగుతాయి. ప్రభుత్వ యంత్రాంగం అంతా శీతాకాల సమావేశాలకు వస్తున్నందున ఈ ప్రాంత సమస్యలపై చర్చకు అవకాశం ఉంటుందని స్థానికులు భావించారు. కానీ ఏటా శీతాకాల సమావేశాలలో కొసమెరుపు అనిపించేలా కొన్ని గంటలు మాత్రమే ఉత్తర కర్ణాటక సమస్యలపై చర్చలు సాగుతాయి. పైగా బెళగావిలో శాసనసభ సమావేశాలంటే వందలకొద్దీ నిరసనలు కొనసాగుతాయి. వీటిలో ఉత్తర కర్ణాటకకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉంటాయి. పేరుకు మాత్రమే సువర్ణసౌధను నిర్మించారని, కానీ ఈ ప్రాంత అభివృద్ధికై స్పష్టమైన తీర్మానాలు లేవని పార్టీలకు అతీతంగా శాసనసభ్యులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుంటారు. ప్రత్యేకరాష్ట్రం డిమాండ్ స్థానిక పోరాట నేతలే కాదు.. కొందరు సీనియర్ నేతలు తరచూ ప్రస్తావిస్తుంటారు. గతంలో బీజేపీ అగ్రనేత ఉమేశ్‌కత్తి ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేశారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే రాజు కాగె ఇటీవలే ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేశారు.

ప్రత్యేక బడ్జెట్ కోసం డిమాండ్

ప్రత్యేక రాష్ట్రం సాధ్యం కాదని భావించిన పోరాట నేతలు శాసనసభ సమావేశాలలో సమగ్ర తీర్మానాలకు కొత్త ప్రతిపాదన పెట్టారు. ఉత్తర కర్ణాటకలో 96మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, ప్రత్యేక రాష్ట్రం ప్రతిపాదన సమంజసం కాదని, కనీసం ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని పలువురు పోరాటనేతలు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఉత్తర కర్ణాటక అభివృద్ధి చెందాలంటే కేవలం ప్రత్యేక బడ్జెట్ ద్వారా అభివృద్ధికి మార్గదర్శకాలు చూపాలని డిమాండ్ చేస్తున్నారు. బెళగావిలో జరిగే శీతాకాల శాసనసభ సమావేశాల్లో పలు తీర్మానాలపై డిమాండ్ చేస్తున్నారు. బెళగావి రెండో రాజధానిగా అధికారికంగా ప్రకటించాలని, సువర్ణసౌధకు ప్రత్యేక కార్యదర్శితో పాటు కార్యాలయాలను బదిలీ చేయాలని, కిత్తూరు కర్ణాటకకు ప్రత్యేక సచివాలయంతోపాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని ఉత్తర కర్ణాటక పోరాట సమితి ప్రధాన కార్యదర్శి అశోక్ చందరగి డిమాండ్ చేశారు.



బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయంటే ఏదో ఒక డిమాండ్ తెరపైకి వస్తుంది. గతంలో మహారాష్ట్రలో బెళగావి ప్రాంతాలను విలీనం చేయాలని మహారాష్ట్ర ఏకీకరణ సమితి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఉత్తర కర్ణాటక పోరాట సమితి నేతలకు బలాన్ని చేకూర్చేలా కాగవాడ ఎమ్మెల్యే రాజుకాగె ఉత్తర కర్ణాటక ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని శాసనసభలో మాట్లాడతానంటూ బహిరంగ ప్రకటన చేశారు. పైగా ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులకు ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేశారు. ఆయన ప్రతిపాదనను సుమారు 25మంది ఎమ్మెల్యేలు మద్దతు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి శాసనసభ సమావేశాలలో ఈ అంశం ఎటువంటి పరిణామాలకు దారి తీస్తుందోనని అధికార కాంగ్రెస్ బెంబేలెత్తుతోంది. మరోవైపు ప్రతిపక్షాలకు ఉత్తర కర్ణాటక సమస్యలతోపాటు అధికార పార్టీ ప్రస్తావించే అంశాలు అస్త్రాలుగా మారనున్నాయి.

● ఉత్తర కర్ణాటక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్ గోలశెట్టి మాట్లాడుతూ 1.50 కోట్లమంది ప్రజలు ఉత్తర కర్ణాటక ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నారని అందుకు సంబంధించి లిఖితపూర్వకమైన అభిప్రాయాలు ఉన్నాయన్నారు. గతంలో ఉమేశ్‌కత్తి తరచూ ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేసేవారన్నారు. ప్రస్తుతం ఆ ధ్వని రాజుకాగె ద్వారా వినిపిస్తోందన్నారు. విజయపుర ఎంపీ రమేశ్ జిగజిణగితోపాటు 25మందికిపైగా ఎమ్మెల్యేలు ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ చేస్తున్నారన్నారు.

ప్రత్యేక బడ్జెట్ అయినా ప్రవేశపెట్టండి

● ప్రత్యేక రాష్ట్రం సాధ్యం కానప్పుడు ప్రత్యేక బడ్జెట్ ద్వారా అయినా ఈ ప్రాంతంపై పాలకులు అభిమానాన్ని చూపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. 96మంది ఎమ్మెల్యేలు ఈ ప్రాంతంలో ఉన్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కాదంటే ప్రత్యేక బడ్జెట్‌కు ఎందుకు డిమాండ్ చేయరని ప్రశ్నించారు. బెళగావి, విజయపుర (బిజాపుర), బాగల్‌కోటె, కలబురగి, బీదర్, గదగ్, హుబ్బళ్ళి, ధారవాడ జిల్లాల్లో పెండింగ్ సమస్యల జాబితాను సిద్ధం చేసి శాసనసభ సమావేశాలలో ప్రస్తావించాలన్నారు. మార్చిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఉత్తర కర్ణాటకకు ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేయాలన్నారు. అధికారికంగా బెళగావిని రెండో రాజధానిగా ప్రకటిస్తేనే ప్రత్యేకమైన వెసలుబాట్లు సాధ్యమవుతాయన్నారు. బెంగళూరుకు సౌలభ్యాలు, రాష్ట్రస్థాయి కార్యాలయాలు సువర్ణసౌధకు బదిలీ కావాలన్నారు. ఉత్తర కర్ణాటక ప్రజాప్రతినిధులు మినహా బెంగళూరు వైభవంలో మునిరిగి తేలుతున్నారని, అక్కడనుంచే అధికారం చెలాయిస్తున్నారని, ఆస్తులు చేసుకుంటున్నారని, వాటన్నింటినీ వీడి ఉత్తర కర్ణాటక అభివృద్ధికి పట్టుదలతో కలాపాలలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు.

తల్లీకొడుకు ఆత్మహత్య

● ఉరి వేసుకుని బలవన్మరణం



డాక్టర్ జయశ్రీ



ఆకాశ్ (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): శివమొగ్గ నగరంలోని అశ్వత్థకాలనీలో ఒకే ఇంట్లో తల్లీకొడుకులు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గురువారం రాత్రి పొద్దుపోయాక సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. తల్లి వైద్యురాలు జయశ్రీ (57), కుమారుడు ఆకాశ్ (32) ఆత్మహత్యకు పాల్పడినవారు. అయితే ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని వినోభానగర్ పోలీసులు తెలిపారు. డాక్టర్ జయశ్రీ శివమొగ్గలో గైనకాలజిస్ట్‌గా ఉన్నారు. గురువారం రాత్రి తల్లీకొడుకుల మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఆమె గదిలోకి వెళ్లి ఆస్తులను కుమారుడు, కోడలిపేరిట రాసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆ తర్వాత కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల కిందట ఆకాశ్ మొదటి భార్య ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఇద్దరూ మానసికంగా ఇబ్బంది పడ్డారు. ఇటీవల మేనెలలో ఆకాశ్ రెండోపెళ్లి చేసుకున్నారు. ఇంట్లో ఆకాశ్ భార్య ఉన్నప్పుడే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.



మండ్యలో వ్యవసాయ మేళాను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

కృషి మేళాతో సాంకేతిక పరిజ్ఞానం

● రైతులు సద్వినియోగం చేసుకోవాలి
● సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కృషి మేళా ఏర్పాటు ద్వారా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరువ కానుందని సీఎం సిద్దరామయ్య అన్నారు. శుక్రవారం మండ్యలోని వీసీ ఫారంలో ఏర్పాటు చేసిన కృషి మేళాను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్, ఇతర ప్రదర్శనలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కృషి మేళా ఏర్పాటు ద్వారా రైతులు సాగు చేసిన పంట ఉత్పత్తులను ప్రదర్శించేందుకు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా సాధ్యం చేసిన నూతన వంగడాలు, సాంకేతిక పరికరాల ప్రదర్శనలు మేళాలో ఉంటాయన్నారు. తద్వారా రైతులు అవగాహన పొందుతారన్నారు. అందుకే ప్రదర్శనలను తిలకించేందుకు రైతులు ఆసక్తి చూపాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, ఎమ్మెల్యేలు దర్శన్ పుట్టణ్ణయ్య, మలవళ్ళి నరేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలు తిలకించేందుకు మండ్య, మైసూరు ప్రాంతాలకు చెందిన రైతులు తరలివచ్చారు.



వివిధ జిల్లాల వ్యవసాయ శాఖ కార్యాలయాల నమూనాల ప్రదర్శన

మల్నాడ్ రకం పశువులు



మూడుసార్లు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు


● బోర్డు విధానంలో మార్పులు లేవు
● విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప



బెంగళూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ వార్షిక పరీక్షలు గత ఏడాది మాదిరిగానే ప్రస్తుత విద్యాసంవత్సరంలోనూ మూడుసార్లు జరుగుతాయని ఎటువంటి మార్పులు ఉండవని, అనవసర గందరగోళం గురించి పట్టించుకోరాదని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప తెలిపారు. శివమొగ్గలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షలు ఈ ఏడాది రెండుసార్లు మాత్రమే జరుగుతాయన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ వద్ద ఎటువంటి ప్రస్తావనలుగానీ, చర్చలుగానీ లేదన్నారు. విద్యార్థులను గందరగోళానికి గురి చేయరాదన్నారు. విద్యార్థులు ధైర్యం కోల్పోయేలా చేయరాదని మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ విషయమై అనవసరపు చర్చ సరికాదన్నారు. పరీక్షా పద్ధతిలో మార్పు తీసుకురావాలంటే ప్రభుత్వం చర్చించాల్సి ఉందన్నారు. మీడియాకు సమాచారం లేకుండా మార్పులు సాధ్యమా... అన్నారు. ఈ ఏడాది ఎస్ఎస్ఎల్‌సీ ప్రధాన పరీక్షలతోపాటు సప్లిమెంటరీ రెండుసార్లు జరుగుతుందన్నారు.

హోసూరు గజ..గజ

● వణికిస్తున్న చలి
● కనిష్ఠ ఉష్ణోగ్రత 16 డిగ్రీలుగా నమోదు



మంచు కప్పేసిన హోసూరు పట్టణం

హోసూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రతి సంవత్సరం హోసూరు ప్రాంతంలో నవంబరు, డిసెంబరు నెలల్లో తీవ్రమైన చలి ఉంటుంది. భారీ వర్షాల కారణంగా, చలి ప్రభావం సాధారణం కంటే ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితిలో తుఫాను ప్రభావం కారణంగా తమిళనాడులోని వివిధ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ గత 3 రోజులుగా హోసూరు ప్రాంతంలో కూడా చాలా చల్లని ప్రాంతంగా మారిపోయింది. శుక్రవారం ఉదయం కనిష్ఠ ఉష్ణోగ్రత 16.3 డిగ్రీలు ఉష్ణోగ్రత సెల్సియస్‌గా నమోదైంది. అదేవిధంగా పగటి వేళ సగటు ఉష్ణోగ్రత 18.2 డిగ్రీల సెల్సియస్‌గా మధ్యాహ్నం 23 డిగ్రీలుగా నమోదైంది. గరిష్ఠ తేమ వాతావరణం 87.5 శాతంగా ఉంది. చలి తీవ్రతమకు వృద్ధులు మాత్రం బయటకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యారు. బడికి వెళ్లే చిన్న పిల్లలు, విద్యార్థులు స్వెటర్లు ధరించి వెళ్తున్నారు. కర్మాగారాలకు వెళ్లే స్త్రీలు, పురుషులు స్వెటర్లు ధరించి రాకపోకలు సాగిస్తున్నారు.

సబ్బుల ఫ్యాక్టరీ టెండర్లలో వెయ్యికోట్ల అవినీతి



మీడియాతో మాట్లాడుతున్న జేడీఎస్ ఎమ్మెల్యే మంజు

● జేడీఎస్ ఎమ్మెల్యే మంజు ఆరోపణ

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వంపై మరో తీవ్రమైన ఆరోపణ వచ్చింది. సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ కార్పొరేషన్‌కు అవసరమైన కొనుగోళ్లలో రూ.వెయ్యికోట్ల అవినీతి జరిగిందని కేఆర్‌పేట జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ మంజు ఆరోపించారు. బెంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మా ట్లాడారు. అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఇందులో భాగస్వామ్యులయ్యారన్నారు. 1918లో కర్ణాటక సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ సంస్థ ఏర్పడిందన్నారు. సోపులు, డిటర్జెంట్‌ల తయారీకి కేవలం ఒకే కంపెనీకి టెండర్లు దక్కుతున్నాయన్నారు. కర్ణాటక అరోమాస్ కంపెనీకి 9సార్లు టెండర్లు ఇచ్చారన్నారు. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కంపెనీకి టెండరు కేటాయించడం వెనుక అవినీతి జరిగిందన్నారు. 2019లోనే ఈ కంపెనీ బ్లాక్‌లిస్ట్‌లో ఉందన్నారు. 2022-23లో కేజీ శాండల్ ఆయిల్ రూ.2,24,655గా ఉందన్నారు. తాను వివరాలు కోరుతూ 2022-23కు సంబంధించి లేఖ రాశానన్నారు. అదే ఆయిల్ రూ.93,116కు విక్రయిస్తున్నారన్నారు. గతంలో కేజీకి రూ.1.2లక్షలు ఎక్కువగా కొనుగోలు చేశారని, ఇప్పటివరకు 11వేల కేజీల శాండల్ ఆయిల్‌ను కొనుగోలు చేశారన్నారు. ఇలా రూ.132 కోట్ల నష్టం జరిగిందన్నారు. టెండర్లలో భారీగా నష్టం జరిగిందన్నారు. రూ.1700 కోట్ల వ్యవహారంలో రూ.వెయ్యి కోట్లు అక్రమాలు ఉన్నాయన్నారు. అక్రమాలు బహిరంగం అయ్యాక దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించలేదన్నారు.



భక్తి పారవశ్యం

● వైభవంగా భూతప్పల ఉత్సవం ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు



జ్యోతులతో నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, నరసింహస్వామి, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు

మడకశిర రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ భక్తరహళ్ళి నరసింహ స్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం భూతప్పల ఉత్సవం, జ్యోతుల పరుష వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామికి పూజలు చేశారు. అనంతరం భూతప్ప ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో అర్చకులు ముందుగా వెళ్తున్నారు. వెనకాలే నాట్యం చేసుకుంటూ భూతప్పలు కదిలారు. భూతప్పల పాదస్పర్శతో కోరికలు తీరుతాయనీ, రోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. దీంతో వందలాది మంది భక్తులు భక్తితో భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. వారిపై నాట్యం చేసుకుంటూ భూతప్పలు వెళ్లారు. గంటపాటు సాగిన ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం నరసింహ స్వామిని దర్శించుకున్నారు.

జ్యోతుల పరుష

తెల్లవారుజామునే జ్యోతుల పరుష ప్రారంభమైంది. మొక్కుబడి ఉన్న వారు జ్యోతులను తయారుచేసి, వాటిని తలపై పెట్టుకుని, స్వామి నామస్మరణ చేసుకుంటూ కాలినడకన జిల్లేడగుంటకు చేరుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయ ప్రదక్షిణ అనంతరం భక్తరహళ్ళికి వచ్చారు. నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు తీర్చుకున్నారు. రైతులు పండించిన వేరుశనగ, వరి, అరటిపండ్లను స్వామివారి ఆలయంపై వేశారు. ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 200 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

మంచి పత్తినే తీసుకురండి

● మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్



రాఘవేంద్రకుమార్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

అనంతపురంరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తిని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వెళ్లే రైతులు పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ సూచించారు. ఆమేరకు శుక్రవారం ఆయన పత్తి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని రైతులు పండించిన పత్తిని గుత్తిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పత్తిని బాగా ఆరబెట్టి శుభ్రంగా తీసుకురావాలన్నారు. వర్షం వలన తడిసిన పత్తిని తీసుకురావద్దన్నారు. దుమ్ము, ధూళి లేకుండా చూడాలన్నారు. చెత్త, చెదారం కలిసిన పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు. రంగు మారిన, పురుగు పట్టిన కాయలను వేరు చేసి మంచి పత్తినే తీసుకురావాలన్నారు. నీళ్లు చల్లిన, పాత పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. కొడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలుపవద్దన్నారు. యార్డుకు లూజ్ రూపంలో మాత్రమే తీసుకు రావాలన్నారు. అమ్మకానికి వచ్చే రైతులు బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని సూచించారు. తేమ 12శాతం మించి ఉంటే పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేయరన్నారు.

డీజిల్ దందా

హిందూపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీజిల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక నుంచి నిత్యం డీజిల్‌ను హిందూపురానికి అక్రమంగా తెస్తున్నారు. హిందూపురానికి చెందిన వ్యక్తులు కర్ణాటకలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో కంటే కర్ణాటకలో ధరలు తక్కువగా ఉండటంతో నిత్యం 10వేల లీటర్లకు పైగా డీజిల్ తీసుకొచ్చి, విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నిత్యం వేలాది లీటర్ల డీజిల్‌ను అక్రమంగా విక్రయించడంవల్ల స్థానిక పెట్రోల్‌బంక్ యజమానులు ఇబ్బంది పడుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అక్రమార్కుల యాపారం నిరాఘాటంగా సాగుతోంది.

రోజుకు 10వేల లీటర్లు

హిందూపురం, గోరంట్ల, పెనుకొండ రహదారిలో ఉన్న పరిశ్రమలకు కర్ణాటక నుంచి తెచ్చిన డీజిల్‌ను రోజూ 4వేల నుంచి 5వేల లీటర్లు ఇస్తున్నట్లు సమాచారం. గార్మెంట్స్, కియ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు చేసిన ప్రైవేట్ బస్సులకు మరో 2వేల లీటర్లదాకా రోజూ ఇస్తున్నట్లు తెలిసింది. అయితే పరిశ్రమలకు రాత్రి పొద్దుపోయాక తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బస్సులకైతే పగటిపూటే అవి పార్క్‌చేసిన స్థలానికి వాహనాల్లో వెళ్లి నింపుతున్నట్లు సమాచారం.

రూ.లక్షలు పోగేసుకుంటున్న అక్రమార్కులు

ఆంధ్రలో లీటరు డీజిల్ రూ.100 ఉండగా కర్ణాటకలో రూ.92 నుంచి రూ.93కే దొరుకుతోంది. అంటే లీటరుపై రూ.7దాకా వ్యత్యాసం ఉంది. లీటరుపై రూపాయి ఖర్చులు పోయినా రూ.6 మిగులుతుంది. ఈలెక్కన డీజిల్ తరలించే వ్యక్తులు నెలకు దాదాపు రూ.20లక్షలకుపైగా వెనకేసుకుంటున్నారు. ఇదంతా ప్రభుత్వాదాయానికి గండి కొట్టి సంపాదిస్తున్నదే. నెలకు 3లక్షల లీటర్లు పైగానే కర్ణాటక నుంచి హిందూపురం ప్రాంతానికి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం మూడు టాటాఏస్ వాహనాలకు ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నారు.

చోద్యంచూస్తున్న అధికారులు

కర్ణాటక నుంచి డీజల్‌ను తీసుకొచ్చి దర్జాగా ఇక్కడ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొన్ని సందర్భాల్లో లారీ ట్యాంకర్‌నే ఇక్కడున్న పెట్రోల్‌బంకు వద్దకు తెచ్చి అమ్మేస్తున్నారు. దీన్ని పన్నులు, పౌరసరఫరాల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ డీజిల్ దందాలో కొందరు చిన్న స్థాయి నాయకులు ఉండటం వల్లే అధికారులు వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

47 మందికి ఉద్యోగాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 47 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రాంగణంలో డిల్ఫీ టీవీఎస్ టెక్నాలజీస్ కంపెనీ శుక్రవారం నియామకాలు చేపట్టింది. కళాశాల మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచుల విద్యార్థులు పాల్గొనగా... 47 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలను ఎంపికైన విద్యార్థులను ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ ఆచార్య కిరణ్మయి, ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి డా. శ్రీనివాసులు అభినందించారు.

అంతా అస్తవ్యస్తం..!

అనంతపురంఅర్బన్/తాడిపత్రి/గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన పత్తి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకురావడమే గందరగోళానికి కారణమవుతోంది. గతంలో ఈ-క్రాప్ బుక్ చేసుకున్న రైతులతో సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనేవారు. అయితే ఈ ఏడాది రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని షరతు పెట్టారు. నిర్దేశించిన తేదీల్లోనే యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలన్న నిబంధన విధించారు. రైతు సేవాకేంద్రాల్లో సిబ్బంది ఈ ప్రక్రియ చేయాల్సి ఉండగా, కొత్త యాప్ సక్రమంగా పనిచేయడంలేదని, రైతులు సెల్ ఫోన్లల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో చేసేదేమిలేక రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేరు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సర్వర్ పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొత్త యాప్‌పై రైతులకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాల వద్దకు, గుత్తి మార్కెట్ యార్డుకు రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువే

ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 44వేల హెక్టార్లుగా నిర్ణయించారు. అయితే జిల్లా వ్యాప్తంగా 30వేల హెక్టార్లల్లో మాత్రమే పత్తి పంట సాగైంది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ సారి పత్తి పంట సాగు తగ్గింది. పెట్టుబడులు పెరగడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడమే సాగు తగ్గడానికి కారణమని రైతులు చెబుతున్నారు. ఈ సారి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు, పత్తి దిగుబడి అరకొరగానే వచ్చింది. అయినా ధర మాత్రం పెరగలేదు. కొందరు దళారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల కిందట క్వింటా పత్తి రూ.10వేలు పలికింది. రెండేళ్ల కిందట క్వింటా నాణ్యతను బట్టి పత్తి రూ.7వేల నుంచి రూ.8వేలు దాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తినాణ్యతను బట్టి క్వింటాల్ ధర రూ.5500 నుంచి రూ.7000లు దాకా పలుకుతోంది. ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధర రూ.8110లుగా నిర్ణయించింది. తేమ శాతం ఆధారంగా ధర చెల్లించేలా నిర్ణయించారు. 8 శాతం తేమ ఉంటే.. క్వింటాల్ పత్తి రూ.8110లుగా నిర్ణయించారు.

పేరు నమోదు చేశా: రైతు నాగేంద్ర, ఊటకల్లు, గుత్తి మండలం



ఈ సారి ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. 35 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. బయట మార్కెట్‌లో ఫస్ట్ క్వాలిటీ పత్తి క్వింటాల్ రూ.7000లు, రెండో క్వాలిటీ రకం రూ.6400లకు అడుగుతున్నారు. ఇంకా బాగలేకపోతే పత్తివైపే చూడటం లేదు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.8110లు పెట్టింది. వారం రోజుల క్రితమే స్థానిక రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నా. ఏ రోజు పత్తి తీసుకురావాలన్న సమాచారం ఎవరూ ఇవ్వలేదు. గతంలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏఏ తేదీల్లో కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకురావాలో ముందుగా చెప్పేవారు. ఇప్పుడు సమాచారం ఇచ్చే నాథుడే లేడు.

ఇబ్బందిగా ఉంది: ఈశ్వర్‌రెడ్డి, తిమ్మాపురం, పెద్దవడుగూరు



పత్తి విక్రయించాలనుకొనే రైతులు కొత్త యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని షరతు పెట్టడంతో ఇబ్బందిగా ఉంది. సెల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, అందులో స్లాట్ బుక్ చేసుకోవాలని చెబుతున్నారు. అది ఎలా చేయాలన్నది మాకు తెలియదు. రైతు సేవా కేంద్రానికి వెళ్లిన సమయంలో సర్వర్ సరిగా పనిచేయడం లేదు. గత ఏడాది మా గ్రామంలోని చాలా మంది రైతులు గుత్తి మార్కెట్ యార్డులో పత్తి శాంపుల్స్ ఇచ్చినా.. పత్తిని కొనుగోలు చేయలేదు. ఈ సారైనా పత్తి కొనుగోలు చేస్తారో...? లేదో అర్థం కావడం లేదు. బయట మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా సమాచారం అందించి, పత్తి కొనుగోలు చేయాలి. .

వారానికి ఒకరోజు.. దారుణం



ఎన్నడూలేని విధంగా వారానికి ఒక రోజు మాత్రమే పత్తిని కొనుగోలు చేసేలా అధికారులు నిర్ణయించడం దారుణం. రైతులకు అవగాహన కల్పించకనే కొత్త యాప్‌లు తీసుకురావడం సరికాదు. స్లాట్ బుకింగ్‌తోపాటు ఏ తేదీన పత్తిని కేంద్రానికి తీసుకువెళ్లాలన్న సమాచారం కూడా యాప్‌లో చూసుకుంటేనే తెలుస్తోంది. మార్కెట్ యార్డు అధికారులకు కూడా ఈ సమాచారం ముందస్తుగా తెలియకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. సీసీఐ అధికారులు, మార్కెట్ యార్డు యంత్రాంగం మధ్య పూర్తి స్థాయిలో సమన్వయం లేదు. నాణ్యత లేదంటూ రైతులు తీసుకువెళ్లిన పత్తిని కొనుగోలు చేయకుండా వెనక్కి పంపిస్తున్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామాల్లో టాంటాం ద్వారా రైతులకు స్లాట్ బుకింగ్ తేదీతోపాటు ఏఏ తేదీల్లో కేంద్రానికి పత్తిని తీసుకువెళ్లాలో సమాచారం ఇవ్వాలి. తాడిపత్రిలోనూ తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

- చంద్రశేఖర్‌రెడ్డి,
ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

జేడీఏ చంద్రానాయక్‌కు తీవ్ర మందలింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న సమయంలో ఏడీఏ పీపీ విద్యావతిపై అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారన్న అభియోగాలపై అప్పటి జేడీఏ చంద్రానాయక్‌ను వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తీవ్రంగా మందలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం కడప జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. గతంలో జేడీఏ కార్యాలయంలో పనిచేసిన ఏడీఏ పీపీ విద్యావతి జేడీఏ తనను ఇతర ఉద్యోగుల ఎదుట అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించి, అవమానించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనరేట్ ఉన్నతాధికారితో విచారణ చేయించారు. విచారణలో ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు చేయనని చంద్రానాయక్ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించారు. ఈ నేపథ్యంలో చంద్రానాయక్‌ను తీవ్రంగా మందలించడంతో పాటు భవిష్యత్తులో తమ పరిధిలో పనిచేసే ఉద్యోగులపై దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించకూడదని హెచ్చరించారు.

వీఆర్వో వెంకోబారావు సస్పెన్షన్



వీఆర్వో వెంకోబారావు

నార్పల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రైతును లంచం డిమాండ్ చేసిన మండలంలోని దుగుమర్రి వీఆర్వో వెంకోబారావును కలెక్టర్ ఆనంద్ సస్పెండ్ చేశారు. మూడు రోజులక్రితం రంగాపురం గ్రామానికి చెందిన రైతు నాగార్జున, కుళ్లాయప్ప భూమిని మ్యుటేషన్ చేయడానికి సెల్‌ఫోన్‌లో వీఆర్వో వెంకోబారావు రూ.38 వేలు లంచం డిమాండ్ చేశాడు. వీఆర్వో మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా వీఆర్వోను సస్పెండ్ చేశారు.

హైవేల జంక్షన్..!

చిలమత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో భాగంగా మండలంలోని కోడూరు గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎప్పటినుంచో కోడూరు తోపు పచ్చదనానికి, ఆహ్లాదకర వాతావరణానికి కేరాఫ్‌గా ఉంటోంది. అలాంటి ప్రాంతం ప్రస్తుతం రాష్ట్రంలోనే పెద్ద జాతీయ రహదారులకు పుట్టినిల్లుగా మారుతోంది. దీంతో కోడూరు రూపురేఖలు మారనున్నాయి. కోడూరు 44వ జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఇప్పుడు ఈ ప్రాంతం మరో రెండు జాతీయ రహదారులకు ప్రారంభ నిలయంగా మారుతోంది. ఇక్కడి నుంచే రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన గ్రీన్‌ఫీల్డ్ హైవే పురుడుపోసుకుంటోంది. అదేబాటలో మరో జాతీయ రహదారి 342 కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతోంది. దీంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. 544-ఇ జాతీయ రహదారి కూడా కొడికొండ చెక్‌పోస్టు నుంచి ప్రారంభం కావడంతో ఈ ప్రాంతం జాతీయ రహదారులకు పుట్టినిల్లుగా మారిందనే చెప్పవచ్చు.

44వ జాతీయ రహదారి

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోనే అతి పొడవైనది 44వ జాతీయ రహదారి. ఈ రహదారి కోడూరు మీదుగా వెళ్లడంతో మొదటి నుంచి రవాణా సౌకర్యం ఎంతో మెరుగ్గా ఉంటోంది. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా సునాయాసంగా వెళ్లేందుకు వీలుంది. రాష్ట్రానికి సరిహద్దుగా కోడూరు ప్రాంతం ఉండటంతో ఈ రహదారి ఈ ప్రాంత వాసులకు వరంగా మారిందనే చెప్పవచ్చు.

గ్రీన్ ఫీల్డ్ హైవే

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 44వ జాతీయ రహదారిలోని కోడూరు వద్ద ఈ ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి ప్రారంభమై బాపట్ల జిల్లాలోని అద్దంకి వద్ద ఎన్‌హెచ్ 16లో కలుస్తుంది. ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణం ఈ ప్రాంత అభివృద్ధికి నాంది అని చెప్పవచ్చు. రూ.14 వేల కోట్లతో 518 కిలోమీటర్ల పొడవుతో ఈ రహదారి నిర్మాణం జరుగుతోంది. సాధారణంగా బెంగళూరు నుంచి విజయవాడకు ప్రయాణ సమయం 10 నుంచి 12 గంటలు పట్టేది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే 5 నుంచి 6 గంటల్లోపే చేరుకోవచ్చు. దీంతో బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లేవారు ఈ రహదారి గుండానే ప్రయాణం చేస్తారు.

342వ జాతీయ రహదారి

44వ జాతీయ రహదారిలోని కోడూరు వద్ద 342 జాతీయ రహదారి ప్రారంభమై ముదిగుబ్బ వద్ద ఎన్‌హెచ్ 42లో కలుస్తుంది. ఈ రహదారి బెంగళూరు నుంచి పుట్టపర్తికి రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. కోడూరు నుంచి ముదిగుబ్బ వరకు 47 కిలోమీటర్లు పొడవు ఉంది. పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశవిదేశీయులు బెంగళూరు నుంచి వెళ్లేందుకు ఈ జాతీయ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఇప్పటికే ఈ జాతీయ రహదారి నాలుగు వరుసలుగా రూపుదిద్దుకుంటోంది. త్వరలో పనులు పూర్తి చేసుకుని, ప్రజలకు అందుబాటులోకి రానుంది.

544ఇ రహదారి

44వ జాతీయ రహదారిలోని కొడికొండ చెక్‌పోస్టు నుంచి నాలుగు వరుసల 544ఇ జాతీయ రహదారి ప్రారంభమై కర్ణాటకలోని శిర వద్ద ఎన్‌హెచ్ 48లో కలుస్తుంది. ఈ రహదారి 119 కిలోమీటర్ల పొడవు ఉంది. దీంతో ఉత్తర కర్ణాటకకు ప్రయాణించే వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

దేశ అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర గొప్పదనే విషయం అందరికీ తెలిసిందే. నాలుగు జాతీయ రహదారులు ఒకే చోట నుంచి ప్రారంభమైతే ఇక వేరే చెప్పాల్సిన పనిలేదు. కోడూరు కేంద్రంగా నాలుగు జాతీయ రహదారులు ప్రారంభమై పలు ప్రాంతాలకు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో కోడూరు ప్రాంతం భవిష్యత్తు అభివృద్ధికి చిహ్నంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

రేపు స్కాలర్‌షిప్ టెస్టు

● విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం



స్కాలర్‌షిప్ టెస్టు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పుట్టపర్తిరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 7న ఉచిత స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమచంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జర్మనీ అనహిత స్టిఫుంగ్ ఫౌండేషన్ సహకారంతో బీటెక్, బీబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించే స్కాలర్‌షిప్ టెస్టులో అర్హత సాధించిన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యంతోపాటు ఉచిత విద్య అందిస్తామన్నారు. బీటెక్ అడ్మిషన్ల కోసం ప్రస్తుతం ఎంపీసీ స్ట్రీమ్‌ను అభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థినీవిద్యార్థులు, బీబీఏ ప్రవేశానికి ఇంటర్మీడియట్ అన్ని స్ట్రీమ్స్ వారు అర్హులన్నారు. వివరాలకు 9100974530 నంబరులో సంప్రదించాలన్నారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేందుకు అనంతపురం, హిందూపురం, ధర్మవరం, మడకశిర, కదిరి పట్టణాల నుంచి ఉచిత రవాణాసదుపాయం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

● భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజా పుష్పలత

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని అనంతపురం భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజా పుష్పలత సూచించారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ విభాగ కార్యాలయంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ... భూసార పరీక్షల ఆధారంగా పొలాల్లో తగిన మేరకు ఎరువులు వాడాలన్నారు. తద్వారా ఎరువులకు అనవసరంగా పెట్టే ఖర్చులు తగ్గడంతోపాటు, పంటలు మంచి దిగుబడులు వస్తాయన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, భూసార పరీక్షాకేంద్రం ఏఓ కృష్ణకుమారి పాల్గొన్నారు.

గులాబీ గుబులు

● పత్తి పంటలో ఉధృతంగా గులాబీ రంగు పురుగు
● మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం
● ఆందోళనలో రైతులు



ఏపుగా పెరిగిన పత్తిపంట

పెద్దవడుగూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తిపంటను గులాబీరంగు పురుగు గుల్ల చేస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో 15వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. పంట విత్తనం మొదలుకొని దిగుబడి చేతికి వచ్చే వరకు ఎకరాకు రూ.25వేల నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరా సాగుచేస్తే 15నుంచి 20క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చేదని, గిట్టుబాటు ధర ఉండటంతో మంచి ఆదాయం లభించేదని రైతులు చెబుతున్నారు. పత్తి సాగుతో మంచి ఆదాయం ఉండటంతో గత కొన్నేళ్లుగా రైతులు ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. గులాబీరకం పురుగు పత్తి రైతుల ఆశలకు గండి కొడుతోంది. పిందె దశలో ఉన్న పత్తి కాయలకు గులాబీరంగు పురుగు ఆశించడం వల్ల కాయ మాడిపోతుంది. పంటను కాపాడుకోవడానికి వేల రూపాయలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పత్తికాయలను ఆశించిన పురుగు

మొక్కలు ఏపుగా పెరిగి పత్తి కాయలు బాగా వచ్చినా గులాబీ రంగు పురుగు ఆశించడంతో కాయ పగలకుండా మాడిపోతోంది. అరకొరగా వచ్చే దిడుబడి సైతం నాణ్యతగా లేకపోవడంతో తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.




గులాబీ రంగు పురుగు

నష్టం వాటిల్లింది: నల్లపురెడ్డి, కండ్లగూడూరు గ్రామం



నేను మూడు ఎకరాల విస్తీర్ణంలో వర్షాధారంగా పత్తి సాగు చేశా. ఎకరాకు రూ.25వేల చొప్పున మూడెకరాలకు 75వేలు పెట్టుబడి పెట్టా. ఇప్పటికి కేవలం మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటకు ఆశించిన గులాబీరంగు పురుగు నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రయోజనం లేదు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. తద్వారా రైతులకు నష్టం మిగులుతోంది.

అప్పులు మిగిల్చింది: రంగనాయకులు, పెద్దవడుగూరు



కౌలుకు తీసుకొని ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. ఎకరాకు రూ.50వేలు చొప్పున పెట్టుబడి పెట్టగా ఒక్క కేజీ కూడా దిగుబడి రాలేదు. ఈ ఏడాది కాకపోయినా మరో ఏడాది అయినా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్న ఆశతో పంట సాగుచేస్తుంటే, ప్రతి ఏటా అప్పులే మిగులుతున్నాయి. ఏమాత్రం ఆర్థిక ప్రయోజనం ఉండటం లేదు.

మే, జూన్ మాత్రమే అనుకూలం



రైతులు పత్తి పంట సాగు చేయడానికి మే, జూన్ నెలలు మాత్రమే అనుకూలం. అదునుదాటిన తర్వాత పత్తి సాగు చేస్తే శీతల ప్రభావం వల్ల పూతదశలో గులాబీరంగు పురుగు ఆశిస్తుంది. ఎన్నిమార్లు రసాయనిక పురుగుమందులు పిచికారీ చేసినా, లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేసినా నివారించడం కష్టం. రైతులు ఒకేపంటను ఏళ్లతరబడి సాగుచేయకుండా ఇతర పంటలను సాగు చేయాలి. అప్పుడు ఖర్చు తగ్గి, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. -మునికృష్ణ, వ్యవసాయాధికారి

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంమ్...

బీఆర్ అంబేడ్కర్ (వర్ధంతి)



భారత రాజ్యాంగ నిర్మాత, 'భారతరత్న' గ్రహీత భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ జిల్లా మాహూ ప్రాంతంలో జన్మించారు. 'బాబాసాహెబ్'గా పేర్కొందారు. న్యాయ, ఆర్థికశాస్త్ర నిపుణులే కాక రాజకీయనేత, సంఘసంస్కర్త. ఆయన రూపొందించిన రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రపంచంలోనే ఎంతో గొప్పదిగా గుర్తింపు పొందింది. సమాజంలో నిమ్నవర్గాల ఉన్నతికి కృషి చేశారు. కేంద్ర న్యాయశాఖ తొలి మంత్రిగా వ్యవహరించారు. 1956 డిసెంబరు 6న కన్నుమూశారు.

చంద్రలేఖ (జయంతి)




చంద్రలేఖ ప్రభుదాస్ పటేల్ 1928 డిసెంబరు 6న మహారాష్ట్ర రాష్ట్రం వాడా ప్రాంతంలో జన్మించారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు మేనకోడలు. నృత్యకారిణి, కొరియోగ్రాఫర్. ప్రత్యేకించి భరత నాట్యంలో కళాకారిణిగా పేరొందారు. యోగా, కలరియపట్టులోను రాణించారు. రచయితగా ఎన్నో పుస్తకాలు రాశారు. సృజనాత్మక నృత్యానికి సంగీత నాటక అకాడమీ పురస్కారం, కాళిదాస్ సమ్మాన్ తదితర అవార్డులు లభించాయి. 2006 డిసెంబరు 30న కన్నుమూశారు.

సావిత్రి (జయంతి)



తెలుగు సినీరంగంలో 'మహానటి'గా పేరొందిన అలనాటి మేటి నటీమణి నిశ్శంకర సావిత్రి 1936 డిసెంబరు 6న గుంటూరు జిల్లా చిర్రావూరులో జన్మించారు. తెలుగు, తమిళ సినీరంగాలలో నటి, దర్శకురాలు. దానధర్మాల విషయంలో ఆమెది ఎముకలేని చేయి. చిన్నతనంలోనే శాస్త్రీయనృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్టీఆర్, జగ్గయ్య తదితరులు నడిపిన నాటకాల కంపెనీలో పనిచేసి అనంతరం పెదనాన్న నడిపిన నాట్య మండలిలో కూడా నటించారు. తెలుగు సినీచరిత్రలో అజరామరం అనదగిన 'మాయాబజార్'లో ఆమె నటనా వైదుష్యం ఆమె కీర్తిపతాకంలో మణి మకుటంగా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. తమిళంలో 'నడిగర్ తిలగం' అనే బిరుదు పొందారు. తమిళ నటుడు జెమినీ గణేశన్‌ను పెళ్లాడారు. 46వ యేట 1981 డిసెంబరు 26న కన్నుమూశారు.

కద్రి గోపాల్‌నాథ్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత కద్రి గోపాల్‌నాథ్ 1949 డిసెంబరు 6న దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా సజిప మూడ గ్రామంలో జన్మించారు. నాద స్వర విద్వాన్‌గా పేరొందారు. శాక్సోఫోన్‌పై కర్ణాటక సంగీతాన్ని, పాశ్చాత్యసంగీతాన్ని ప్రదర్శించి శాక్సోఫోన్ చక్రవర్తిగా పేరొందారు. ఆకాశవాణి మంగళూరు కేంద్రం ద్వారా తన తొలి కచేరీని చేశారు. కంచికామకోటి పీఠం, శృంగేరి శారదా పీఠం, అహోబిల మఠం, పిళ్ళయార్ పత్తి దేవాలయాలకు ఆస్థాన విద్వాంసుడిగా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కచేరీలు నిర్వహించారు. సంగీతవాద్య రత్న, కర్ణాటక కళాశ్రీ, నాద కళానిధి, కలైమామణి, కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం పొందారు. 2019 అక్టోబరు 19న కన్నుమూశారు.

పీటర్ హాండ్కే (పుట్టినరోజు)



నోబుల్ పురస్కార గ్రహీత పీటర్ హాండ్కే 1942 డిసెంబరు 6న ఆస్ట్రియా దేశం గ్రిఫెన్ ప్రాంతంలో జన్మించారు. ఆయన నవలా రచయిత, అనువాదకుడు, కవి, సినీ దర్శకుడు, స్క్రీన్ రైటర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన రచనలు ఆంగ్లంలోకి అనువాదం అయ్యాయి. 1973లో జార్జ్ బుక్నర్ ప్రైజ్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ ఇబ్సెన్ అవార్డు, జార్జ్ బుక్నర్ ప్రైజ్ తదితర పురస్కారాలు పొందారు. 2019లో సాహిత్యంలో నోబెల్ పురస్కారం పొందారు. జీవిత సాఫల్య పురస్కారంతోపాటు పలు అవార్డులు పొందారు. 2024లో గ్రాండ్ డెకొరేషన్ ఆఫ్ హానర్ ఇన్ గోల్డ్ విత్ సాష్ ఫర్ సర్వీసెస్ టు దిపబ్లిక్ ఆఫ్ ఆస్ట్రియా గౌరవం అందుకున్నారు.

శేఖర్ కపూర్ (పుట్టినరోజు)



హిందీ సినీరంగంలో పేరొందిన దర్శకుడు, 'పద్మశ్రీ' గ్రహీత శేఖర్ కపూర్ 1945 డిసెంబరు 6న పంజాబ్ రాష్ట్రం లాహోర్ ప్రాంతంలో జన్మించారు. నటుడు, నిర్మాత. ప్రముఖ నటుడు దేవానంద్‌కు మేనల్లుడు. 'మసూమ్', 'మిస్టర్ ఇండియా' సినిమాలు ఆయనకు ఎంతో పేరుతెచ్చాయి. 'బండిట్ క్వీన్' సినిమాకు జాతీయ ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ పురస్కారం దక్కింది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు జ్యూరీ సభ్యుడిగా వ్యవహరించారు. 2020 నుంచి ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు ఛైర్మన్‌గా ఉన్నారు. 2023లో 54వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు.

ట్రాఫిక్ పోలీసులకు సంచార శౌచాలయ వాహనం



సంచార శౌచాలయ వాహనానికి పచ్చజెండా ఊపుతున్న హోం మంత్రి

బెంగళూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసులు గంటల తరబడి సర్కిళ్లలోనూ, సిగ్నల్స్ వద్ద రోడ్ల పక్కన డ్యూటీ చేస్తుంటారు. వారు శౌచాలయం వెళ్లేందుకు తగిన స్థలం ఉండదు. ఇలా ఎంతోమంది ట్రాఫిక్‌లో పనిచేసే పోలీసులు ఇబ్బంది పడుతుంటారు. ట్రాఫిక్ పోలీసులకోసమే రినాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, అండ్ బిజినెస్ సెంటర్ ఇండియా కంపెనీ సీఎస్ఆర్‌లో భాగంగా హ్యాండ్ ఇన్ హ్యాండ్ సంస్థ సహకారంతో సంచార శౌచాలయ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం హోం మంత్రి పరమేశ్వర్ 'హైజీన్ ఆన్ గో' వాహనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. డీజీపీ సలీం, నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్‌లు పాల్గొన్నారు. 3 వాహనాలను కొనుగోలు చేసి వాటిలో శౌచాలయాలను అమర్చారు. రద్దీ ట్రాఫిక్ ఉండే ప్రాంతాలలో పనిచేసే పోలీసులకోసం ఈ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యదృష్ట్యా రినాల్ట్ నిస్సాన్ సంస్థ ఎండీ దేబశిష్ నియోగి తెలిపారు. హ్యాండ్ ఇన్ హ్యాండ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కల్పనాశంకర్‌లు పాల్గొన్నారు. ప్రతి వాహనంలో స్త్రీపురుషులకు వేర్వేరుగా శౌచాలయం ఉంటుంది. హ్యాండ్‌వాష్‌తోపాటు మహిళలకు శానిటరీ నాప్‌కిన్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. అద్దంతోపాటు మౌలిక సదుపాయాలు ఉంటాయి. ప్రథమ చికిత్స, ఫైర్ సేఫ్టీ తోపాటు రోడ్డు భద్రతకు ఎల్ఈడీ డిస్‌ప్లే, వాహనం బయట సీసీ కెమెరా, జీపీఎస్ ట్రాకింగ్ సౌలభ్యం ఉంటుందన్నారు.

ఘనంగా మళ్ళూరాంబదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

శిడ్లఘట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో మళ్ళూరాంబదేవి రథోత్సవం ఘనంగా జరిగింది. అత్యంత పురాతన ఆలయమైన మళ్ళూరాంబ దేవాలయ రథోత్సవం చిక్కబళ్ళాపుర జిల్లాలో ప్రసిద్ధి చెందింది. గురువారం అమ్మవారికి విశేషపూజల అనంతరం అలంకరించిన రథంపై ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. తహసీల్దార్ గగనసింధు, ఎమ్మెల్యే రవికుమార్ రథోత్సవాన్ని ప్రారంభించారు. కీలుగుర్రాలు, గారడీ బొమ్మలు, వీరగాసె, డప్పు వాయిద్యాలు ఇతర కళాకారుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. రథోత్సవం సందర్భంగా వివిధ రకాల తినుబండారాలు, ఆటబొమ్మలు, నిత్యావసర వస్తువుల దుకాణాలు వెలిశాయి. రథోత్సవంలో పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు బంకు మునియప్ప, కేపీసీసీ కోఆర్డినేటర్ రాజీవ్‌గౌడ, దేవాలయ సేవా సమితి అధ్యక్షుడు మునిరాజుగౌడ, సమితి పదాధికారులు, గ్రామపంచాయతీ అధ్యక్షురాలు పవిత్ర దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అభ్యాసంతోనే విజయం



లాయర్స్ డేలో సీనియర్ న్యాయాధికారి భారతి

న్యాయాధికారి భారతి

బాగేపల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): నిరంతరం అభ్యాసం, కాలానికి అనుగుణంగా కొత్త అంశాలతో అప్‌డేట్ కావడం ద్వారా ఏ వృత్తిలోనైనా విజయం సాధ్యమని బాగేపల్లి సీనియర్ గ్రేడ్ న్యాయాధికారి భారతి తెలిపారు. పట్టణంలోని ద్వారక పార్టీహాల్‌లో శుక్రవారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో లాయర్స్ డేను ప్రారంభించి మాట్లాడారు. సామాజిక జ్ఞానం, వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో న్యాయవాదులు కూడా పాల్గొన్నారన్నారు. అనేక కష్టాలు, సామాజిక కట్టుబాట్లు, బహిష్కారాల నడుమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. అన్నివర్గాల ప్రజలకు రిజర్వేషన్లు, హక్కులను ఇచ్చారన్నారు. ఇంతటి సాధనకు అంబేడ్కర్ ఎంతో అభ్యాసం చేశారన్నారు. ప్రస్తుత లాయర్‌లు కూడా సీనియర్ల మార్గదర్శనం పొంది ఉత్తమంగా పేరొందాలన్నారు. ఉత్తమమైన ఆలోచనలు పెంపొందించుకోవాలన్నారు. సకారాత్మక భావనలు, విద్య నేర్చుకోవడానికి జ్ఞానవంతుడిగా పేరొందేందుకు ఎంతో శ్రమించాల్సి ఉందన్నారు. ఏ వృత్తిలోనైనా అనేక ఒత్తిళ్లు ఎదుర్కొనాల్సి ఉంటుందని, అలాగే ఆరోగ్యంవైపు దృష్టిసారించాలన్నారు. ఉత్తమ ఆరోగ్యానికి ప్రతిరోజూ ప్రాణాయామం, యోగా అభ్యాసం చేయాలన్నారు. జేఎంఎఫ్‌సీ సివిల్ న్యాయాధికారి డీకే మంజునాథాచారి మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేయడంతోపాటు కక్షిదారులకు న్యాయం కల్పించాలన్నారు. ఎంతో ఓపికగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రంగవల్లులు, సాంస్కృతిక క్రీడా కార్యక్రమాలు కొనసాగాయి. సీనియర్, జూనియర్లకు బహుమతులను ప్రదానం చేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు రవి, కార్యదర్శి ఆర్ జయప్ప, సీనియర్ న్యాయవాదులు సుధాకర్, నంజప్ప, అప్పస్వామి, కరుణాసాగరరెడ్డి, బీవీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

లీచెట్ సంస్కరణకు సిద్ధమైన బీఎస్‌డబ్ల్యూఎంఎల్

బెంగళూరు, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ సంస్థ (బీఎస్‌డబ్ల్యూఎంఎల్) లీచెట్ సంస్కరణ కేంద్రాన్ని నిర్మించేందుకు సిద్ధమైంది. ప్రతి లీటరు లీచెట్ వ్యర్థాల సంస్కరణకు రూ.1.65 పైసలు చొప్పున 474.89 కోట్ల మొత్తంతో టెండరును ముక్త ప్రొటీన్స్ లిమిటెడ్‌కు కేటాయించారు. మిట్టగానహళ్ళి, కణ్ణూరు ప్రదేశాలలో సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ప్రదేశంలో 2878 మిలియన్ లీటర్ల చెత్తనుంచి వచ్చే ద్రవ వ్యర్థాలను సేకరించి సంస్కరించేందుకు టెండరు కేటాయించారు. 9 నెలల్లోగా సంస్కరణ కేంద్రాన్ని నిర్మించాలని రానున్న నాలుగేళ్లలో ప్రక్రియ పూర్తి చేయాలని టెండరు ద్వారా సూచించారు. ప్రమాదకరమైన ద్రవవ్యర్థాలు భూమిలోకి ఇంకి పర్యావరణానికి హానికాకుండా చేపట్టేలా సంస్కరణ కేంద్రాలు పని చేయనున్నాయి. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలో ప్రస్తుతం సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్‌కు లీచెట్‌కు సంబంధించి ప్రత్యేకమైన కేంద్రాలులేవు. వర్షాకాలంలో చెత్త నుంచి వచ్చే ద్రవ వ్యర్థాలు సంస్కరణ కేంద్రాల పరిధిలోని భూములలోకి చేరి అపారమైన నష్టం మిగులుస్తోంది. తద్వారా ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై పెను ప్రభావం చూపనుంది. గత ఏడాది మేలో బెంగళూరులో చెత్త సంస్కరణకు సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్ విభాగాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం జీబీఏకు అనుబంధంగా పని చేయనుంది. ఇంటింటా చెత్తను సేకరించే ఆటో టిప్పర్‌ల ద్వారా క్వారీలు, చెత్తసంస్కరణ కేంద్రాలకు తరలించే బాధ్యతను బీఎస్‌డబ్ల్యూ ఎంఎల్ నిర్వహిస్తోంది. చెత్తనుంచి వచ్చే ద్రవ వ్యర్థాలను లీచెట్‌లుగా పిలుస్తారు. ఇటువంటి వ్యర్థాలు భూమిలో ఇంకకుండా చర్యలు చేపట్టదలిచారు. ఈ వ్యర్థాలను సైతం సంస్కరించే ప్రక్రియకు సిద్ధమయ్యారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించారు... స్తంభం మరిచారు



ఫుట్‌పాత్‌పై వదిలేసిన స్తంభం

బెంగళూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాదిబస్సులు సంచరించే మైసూరురోడ్డు శాటిలైట్ బస్టాప్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉండే ట్రాన్స్‌ఫార్మర్ పాదచారులకు ఆటంకంగా ఉండేది. ఇటీవల ఫిర్యాదులు రావడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించారు. ఫుట్‌పాత్‌పైనే సదరు స్తంభాన్ని వదిలేశారు. వందలాది బస్సులతోపాటు మైసూరు, రామనగర ప్రధాన రహదారి కావడంతో రోజూ వేలాది వాహనాలు ఇదే ప్రాంతంనుంచి వెళ్తుంటాయి. పైగా మైసూరుకు వెళ్లే బస్సులు ఇక్కడనుంచే రాకపోకలు సాగిస్తుండడంతో ఫుట్‌పాత్‌పై తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి దాకా జనసంచారం ఉంటుంది. స్తంభంగా ఉండడంతో పిల్లలు, వృద్ధులు తీవ్రమైన ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. అయినా బెస్కాం అధికారులు ఇదేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

గ్యారెంటీనే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయ్ : మంత్రి



బ్లాక్‌కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

మంత్రి రామలింగారెడ్డి

బొమ్మనహళ్ళి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలు వచ్చే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. బొమ్మనహళ్ళి నియోజకవర్గం హుళిమావులో బొమ్మనహళ్ళి బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఐదు గ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పథకాలతో అన్ని వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారన్నారు. పార్టీలో ఎలాంటి గందరగోళం లేదన్నారు. ప్రతి బ్లాక్‌లోనూ కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా స్థానికుల సమస్యల పరిష్కారానికి వేదికగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బొమ్మనహళ్ళి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, మాజీ ఎంపీ ఉగ్రప్ప, యూబీ వెంకటేశ్, ఆర్‌కే రమేశ్, ఎమ్మెల్సీ రామోజిగౌడ, ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉమాపతిగౌడ, శ్రీనివాస్, అశ్వత్థనారాయణస్వామి, రాఘవేంద్ర, లోకేశ్‌రెడ్డి, ఇనాయత్, స్టార్ గురుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సమాజంలో రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రతియొక్కరు అప్రమత్తంగా ఉండాలంటే ముందు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య అన్నారు.సైబర్ నేరాల పై అవగాహన కల్పించేందుకు గాను శుక్రవారం నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, అధికారులకు ప్రత్యేక కార్యాగారం ఏర్పాటు చేశారు. శిబిరానుద్దేశించి మాట్లాడిన ఎస్పీ, టెక్నాలజి పెరిగిపోవడంతో పాటు నేరాల సంఖ్య కూడా దాని ఆధారంగానే పెరుగుతుండడం ఆందోళనకరమన్నారు. వివిధ రీతుల్లో నేరగాళ్లు ఆధునిక టెక్నాలజిని వినియోగించుకుని మోసాలకు ముఖ్యంగా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతియొక్కరు వీటి పై అవగాహన పెంచుకోవాలన్నారు. కాగా ఈ శిబిరంలో సైబర్ నేరాల పై అవగాహన పెంచుకున్న వారు సమాజంలోని ఇతరులను సహితం అప్రమత్తం చేస్తు నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూలు విడుదల

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూలును ఓపెన్ స్కూల్ సొసైటీ శుక్రవారం ప్రకటించింది. మార్చి 16 నుంచి 28 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2 నుంచి 13 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని వివరించింది. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 11 నుంచి 18 వరకు జరుగుతాయని పేర్కొంది.

స్థానిక సంస్థలకు రూ.281 కోట్లు మంజూరు

అమరావతి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాన్ మిలియన్ పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.281 కోట్లు మంజూరుచేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25 సంవత్సరానికి గాను అన్‌టైడ్ బేసిక్ గ్రాంట్, టైడ్ గ్రాంట్ రెండో విడత చెల్లింపుల కోసం త్రైమాసిక నియంత్రణలను సడలిస్తూ 2025-26 సంవత్సర బడ్జెట్ అంచనాల నుంచి ఈ నిధులను విడుదల చేస్తూ ఆదేశాలిచ్చారు.

ఎంఆర్‌మెడ్ సేవలు విస్తృతం



మీడియాతో సంస్థ ముఖ్యులు

బొమ్మనహళ్ళి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ప్రత్యేక సేవలందిస్తున్న ఎంఆర్‌మెడ్ తన అత్యాధునిక బెంగళూరు కోల్డ్-చైన్ కేంద్రాన్ని ప్రారంభించనుంది. గ్లోబల్‌స్థాయిలో ఎలి లిల్లితో కార్యాచరణకు భాగస్వామ్యం కానుందని ఎంఆర్ మెడ్ సహసంస్థాపకుడు, సీఈఓ దేవశిష్‌సింగ్ తెలిపారు. కోరమంగలలో మీడియాతో మాట్లాడుతూ కోల్డ్-చైన్ ద్వారా అంకాలజీ, జీఎల్‌పీ-1 ఔషధాలు, రోగ నిరోధకచికిత్సలు, మార్పిడి మందులు వంటివాటిని సురక్షితంగా త్వరగా రోగులకు అందనున్నాయన్నారు. మీడియా సమావేశంలో సీబీఓ సౌరబ్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

వైట్‌ఫీల్డ్‌లో బెస్కాం నూతన భవనం



బెస్కాం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేజే జార్జ్

మహదేవపుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైట్‌ఫీల్డ్‌లో బెస్కాం విభాగం, ఇ-4 ఉపవిభాగం కార్యాలయం నూతన భవనాన్ని విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్, నియోజకవర్గ ఎమ్మెల్యే మంజుళా లింబావళి ప్రారంభించారు. ఇమ్మడిహళ్ళి మెయిన్‌రోడ్డులోని గాంధీపురలో ఒకే భవనంలో విద్యుత్ సేవలు లభించనున్నాయి. మంత్రి మాట్లాడుతూ వైట్‌ఫీల్డ్ విభాగంలో 3,88,917 మందికిపైగా వినియోగదారులు ఉన్నారన్నారు. ఎమ్మెల్యే మంజుళా మాట్లాడుతూ బెస్కాం నూతన కార్యాలయ భవనం వైట్‌ఫీల్డ్ ప్రాంత వినియోగదారులకు మరింత అనుకూలం కానుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, బెస్కాం శాఖ ఇన్‌చార్జ్ ముఖ్య కార్యదర్శి గౌరవ్ గుప్త, బెస్కాం ఎండీ డాక్టర్ ఎన్ శివశంకర, బెస్కాం టెక్నికల్ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

120 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్ఐ సుబ్రమణి

ముళబాగిలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆవణి హోబళి పరిధిలో 4-పౌవతి అభియాన రెండోదశలో 120 అర్జీలు వచ్చాయి. మూడో దశలో ప్రతి గ్రామంలో మృతుల కుటుంబీకుల ముఖ్యుల ఇళ్లకు వెళ్లి వారసుదారులకు ఖాతా చేసే అంశంపై జాగృతి కల్పిస్తున్నట్టు ఆర్ఐ సుబ్రమణి తెలిపారు. తాలూకాలోని కాంతరాజ్ సర్కిల్ వద్ద రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన మూడోదశ ఇ-పౌవతి అభియానలో ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ఆవణి హోబళిలో 75 గ్రామాలు ఉండగా వీటిలోని 12 రెవెన్యూ సర్కిల్‌లో అభియాన చేపడుతున్నట్టు తెలిపారు. పూర్వీకుల పేరిట ఉన్న ఆస్తులను వారసుదారులకు అందేలా రాష్ట్రప్రభుత్వం ఈ అభియాన నిర్వహిస్తోందన్నారు. వారసుదారులు అర్జీతో అన్ని రికార్డులను సమర్పిస్తే 16 రోజులలోగా ఖాతా చేసి ధ్రువీకరణపత్రం ఇస్తామన్నారు. వీఏఓలు తనుజ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. జాలప్ప కళాశాల సమీపాన పవన్ (28) మృతిచెందాడు. పవన్‌కు కొంత కాలం క్రితం తండ్రి మృతి చెందాడు. పవన్ అన్న కూడా కోలారు సమీపాన నీటిలో మునిగి మృత్యువాత చెందాడు. పవన్ చిన్నాన్న నరసింహమూర్తి మాట్లాడుతూ తన అన్న కొడుకు ఐఫోన్ కంపెనీలో బస్సు నడిపేవాడని, సాయంత్రం తర్వాత ఆటో నడిపేవాడన్నారు. నా అన్న, పెద్ద కుమారుడు ఇటీవలే మృతి చెందాడని, ఇప్పుడు ఉన్న ఒక కుమారుడు కూడా తీరని లోకాలకు చేరాడని విచారం వ్యక్తం చేశారు. తమకు కల్గిన అన్యాయం మరెవ్వరికీ కారాదన్నారు. నిందితులకు తగిన శిక్ష పడాలన్నారు. గురువారం రాత్రి 10.15 గంటలకు ఆటోలో వస్తుండగా డిక్రాస్ నుంచి టీబీ సర్కిల్ వరకు వెళ్లే మార్గంలో చర్చ్ వద్ద ఆటోను వెంబడిస్తూ స్విఫ్ట్‌కారు అడ్డగించింది. నలుగురు వ్యక్తులు గ్యాంగ్‌గా మారణాయుధాలతో దాడి చేసి పరారయ్యారు. ఘటనా స్థలాన్ని బెంగళూరు రూరల్ జిల్లా ఎస్పీ సీకే బాబా, ఏఎస్పీ వెంకటేశ్ ప్రసన్న, డీఎస్పీ పాండురంగ, ఇన్‌స్పెక్టర్ అమరేశ్‌గౌడ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వైభవంగా సిద్ధలింగేశ్వర రథోత్సవం



రాయచూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని మన్సలాపూర్‌లోని చారిత్రక ఆలయం సిద్ధలింగేశ్వర స్వామి రథోత్సవం గురువారం రాత్రి అంగరంగా వైభవంగా సాగింది. స్వామివారి రథోత్సవం తిలకించేందుకు వివిధ సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా మార్గశిరమాస పౌర్ణికి ముందు వారం రోజుల పాటు శాస్త్రోతంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, పల్లకి సేవా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1621.98	1629.56
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	617	3,332
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,230	5,254
నీటి నిల్వ (టీఎంసీలు)	67.05	92.42

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి: కలెక్టర్

●జిల్లాలో 1.89,745 మంది చిన్నారులకు టీకా వేయడమే లక్ష్యం ● విస్తృత ప్రచారం చేపట్టాలని డీసీ ఆదేశం

బళ్లారి సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 21నుంచి 24వరకు జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అర్హత ఉన్న ప్రతి చిన్నారికి పల్స్‌పోలియో టీకా అందేలా చర్యలు తీసుకోవాలని దీనిపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని జిల్లాపరిపాలన భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన పల్స్‌పోలియో టీకాపై ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో పల్స్ పోలియోకు 1,89745 మంది పిల్లలను గర్తించామన్నారు. 920 టీకా బూతులు, 49మొబైల్ బూత్‌లను ఏర్పాటు చేశామని, ఇంటింటికి వెళ్లి ఇప్పటి నుంచే ప్రచారం చేపట్టాలన్నారు. గత సంవత్సరం జిల్లా 100 శాతం ప్రగతిని సాధించామన్నారు. పల్స్‌పోలియో టీకాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి పాఠశాల పిల్లలలో ర్యాలీ నిర్వహించాలన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమానికి తగినన్ని వాహనాలను అందించాలని రవాణ అధికారులకు ఆదేశించారు. పల్స్ పోలియోవాక్సిన్లు సురక్షితంగా ఉంచడానికి కోల్డ్‌ప్యాక్‌లను సిద్ధం చేయడానికి నిరంతర విద్యుత్ అవసరమని డిసెంబరు 18నుండి 24వరకు పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, మైనింగ్ కార్మికులు, ఇతర వలస ప్రాంతాలలో పుట్టినప్పటి నుండి 5సంవత్సరాల లోపుఉన్న పిల్లలను గుర్తించి టీకాలు వేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్రప్రసాద్

ఈసందర్భంగా జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్, డిహెచ్ఓ రమేశ్‌బాబు, జిల్లా సర్జన్ డా. బసారెడ్డి, డా.శ్రీధర్, అబ్దుల్లా, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప, డా.వీరేంద్ర కుమార్, ఆరోగ్య విద్య ఇన్‌చార్జి ఖుర్షీద్ బేగం, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు,తాలూకాస్థాయి ఆరోగ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతు నాయకులు

మొక్కజొన్న కొనుగోలు చేయాలి

● కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం నాయకుల ఆందోళన

బళ్లారి సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలో తక్షణమే మొక్కజొన్న ఖరీదు కేంద్రాన్ని ప్రారంభించాలని ఏఐకేకేఎంఎస్(అఖిలభారత రైతు కృషి కార్మిక సంఘం) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర సమితి సభ్యులు హనుమంతప్ప మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడు అధికంగా మొక్కజొన్న సాగు చేశారన్నారు. వట్టిమిరపలో చాలా మంది రైతులు నష్టపోయారని, అందుకే మొక్కజొన్న వైపు మొగ్గు చూపారన్నారు. ప్రారంభంలో మొక్కజొన్నకు మంచిధర ఉండేదని, అమాంతం తగ్గిపోవం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. మొక్కజొన్న క్వింటాల్ రూ. 3000 మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. రైతు సంఘం ప్రముఖులు కల్లుకంబ పంపావతి మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గురళ్ళి రాజ,కురుగోడు తాలూకా కార్యదర్శి బసవరాజు, మాబుసాబ్, కాళింగప్ప, మహాలింగప్ప, నటరాజ్, దానప్ప తదితర రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న విద్యాభారతి స్వామీజీ

కంప్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో 42వ వార్షిక కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పరమహంస నారాయణ విద్యాభారతుల స్వాములు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి దర్శనానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

పోలీసులకు నూతన టోపీల పంపిణీ



ప్రసంగిస్తున్న ఎస్పీ జాహ్నవి



సిబ్బందికి టోపీలు అందజేస్తూ..

హోస్పేట్/బళ్లారి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర పోలీసు వ్యవస్థలో దాదాపు ఏడు దశాబ్దాల నాటి సంప్రదాయ టోపీకి కాలం చెల్లింది. 1956 నుంచి ఇప్పటివరకు హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల వాడుతున్న పాత స్లాచ్ టోపీకి గుడ్‌బై చెప్పి విజ్ఞానవంతమైన ఆధునిక రూపుతో కూడిన నేవి బ్లూ పీక్ట్ క్యాప్‌ను అధికారికంగా ప్రవేశపెట్టారు. జిల్లాలోని 1200 మంది పోలీసు సిబ్బందికి ఈ కొత్త క్యాప్‌లను శుక్రవారం డీఏఆర్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ ఎస్. జాహ్నవి పంపిణీ చేశారు.

క్యాప్ కాదు వైఖరి కూడా మారాలి : ఎస్పీ

ఈ కొత్త క్యాప్ పెట్టుకోవడం ఒక మార్పు మాత్రమే కాదు ఒక బాధ్యత ఇది మీ ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని ఎస్పీ జాహ్నవి అన్నారు. సమావేశంలో మాట్లాడిన ఎస్పీ ప్రజల కోసం ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రత కోసం నేరాల నివారణ కోసం క్రమశిక్షణతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ రోజు నుంచే మన శాఖ పేరు, గౌరవం ఇంకా ఎత్తుకు తీసుకెళ్దాం అని సిబ్బందిని ఉద్దేశించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ మంజునాథ్, హోస్పేట్ డీవైఎస్పీ డాక్టర్ మంజునాథ్, కుడ్లిగి డివైఎస్పీ మల్లేష్ దొడ్డమణి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై చర్చిస్తాం: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బెళగావిలో జరుగు శీతాకాల సమావేశ్లో నియోజకవర్గంలోని రైతు సమస్యలపై చర్చిస్తామని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. శుక్రవారం కంప్లి పట్టణంలోని ఎండీ క్యాంప్‌లో 5వ వార్డు, బెళగోడుహాళ్‌లో సీసీ రోడ్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బెళగోడుహాళ్‌లో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు రెండు తాలుకాల్లో ఏర్పాట్లు చేపట్టమన్నారు. నియోజకవర్గంలో మిరప మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీఎం సిద్ధరామయ్య పూర్తి కాలం పదవిలో ఉంటారన్నారు. రానున్న గ్రామ పంచాయతీ, తాలుకా పంచాయతీ, జిల్లా పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. మనస్పర్థలు వదిలి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి గెలుపుకు ముందుకు రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో అభివృద్ధికి గెలుపుకు కృషి చేపట్టిన ఏ కార్యకర్తకైనా వారిని గుర్తించి వారికి హోదా కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర షేక్షావలి, గోపాలప్ప, మనోహర్, బాలకృష్ణ, ప్రసాద్, వీరాంజనేయులు, కృష్ణ, సీఆర్ హనుమంతు, షణ్ముఖప్ప, ఉలిగప్ప, చంద్రశేఖర్ గౌడ, అయ్యప్ప, వాసు విరుపాక్షి, నాగరాజు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం



డాక్టర్ కీర్తి శ్రీనివాస్

బళ్లారిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓపీడీ కంటోన్మెంట్ సమీపంలో అనుష్క హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యులు డాక్టర్ కీర్తి శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్‌తెలిపారు. శుక్రవారం డాక్టర్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఆటో డ్రైవర్లకు, చుట్టుపక్కల ఉన్న కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాళ్లు, కీళ్లు, మోకాలినొప్పులు, మూత్రపిండం, ఎలర్జీ, చర్మవ్యాధి, ఉబ్బసం సమస్యపై సంప్రదించవచ్చన్నారు. 9019497530, 9972980750 నెంబర్లను సంప్రదించాలన్నారు.

హోసూరు జోన్

లైసెన్స్ లేని తుపాకీలు, బుల్లెట్ల స్వాధీనం

హోసూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హోసూరులోని ఈశ్వరీ నగర్ ప్రాంతంలో ఒక ప్రైవేట్ ఫ్యాక్టరీ ఉంది. బెంగళూరులో ప్రధానకార్యాలయం కల్గిన ఫ్యాక్టరీ నగల దుకాణాలకు బంగారు ఆభరణాలను రవాణా చేసే పనిని నిర్వహిస్తోంది. బెంగళూరులో ఉన్న ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ నుంచి వ్యక్తులకు భద్రత కల్పిస్తోంది. ఇందులో బిహార్ నుంచి 12 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. తుపాకులతో ఆయుధాలు ఉన్నాయి. తుపాకులు, బుల్లెట్లకు బిహార్ లైసెన్స్‌లు పొందడం ద్వారా భద్రతా పనులు చేపడుతున్నారు. గత నెల 20న కోయంబత్తూరు కర్మాగారంలో పనిచేస్తున్న అదే ప్రైవేట్ సెక్యూరిటీలను తమిళనాడు పోలీసులు తనిఖీ చేసినప్పుడు, ఆ కర్మాగారం భద్రతా ప్రయోజనాల కోసం సెక్యూరిటీ ఉపయోగించే తుపాకులు, బుల్లెట్లకు బిహార్ లైసెన్స్‌లు మాత్రమే ఉన్నాయని తెలుస్తోంది. తమిళనాడు లైసెన్స్‌లు లేకుండా భద్రతా పనులు చేపడుతున్నారని వెల్లడైంది. కోయంబతూరు పోలీసులు ఫ్యాక్టరీకి చెందిన ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి తుపాకులు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. హోసూరు హడ్కో పోలీసులు గురువారం రాత్రి ప్రైవేట్ ఫ్యాక్టరీలో తనిఖీ చేశారు. బిహార్‌కు చెందిన రంజాన్ అన్సారీ(53), రాబిన్ ఆలం అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. 2 తుపాకులు, 10 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ధర్మపురి జైలుకు తరలించారు.

రైల్వే పోలీసుల ముమ్మర తనిఖీలు



సోదాలు చేస్తున్న పోలీసులు

హోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం సోదాలు చేశారు. హోసూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు ప్రయాణీకుల వస్తువులను తనిఖీ చేసిన తర్వాతే అనుమతించారు. ముఖ్యంగా హోసూరు సమీపంలోనే రాష్ట్ర సరిహద్దుతోపాటు పారిశ్రామిక ప్రాంతం కావడంతో అన్ని చర్యలు చేపట్టారు. 3వేలకుపైగా ఫ్యాక్టరీలు ఉండడంతో తమిళనాడులోని వివిధ జిల్లాలు, వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ కర్మాగారాల్లో కార్మికులుగా, వ్యాపార పెట్టుబడిదారులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడులోని వివిధ ప్రాంతాల నుంచి హోసూరు మీదుగా రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. ముందు జాగ్రత్తచర్యగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీ చేసిన తర్వాతే ప్రయాణికులను ప్రాంతంలోకి అనుమతిస్తున్నారు.

అభివృద్ధి పనులకు డీఎంకే నాయకుల శ్రీకారం



భూమిపూజలో పాల్గొన్న డీఎంకే నాయకుల

హోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు శాసనసభ నియోజకవర్గం పరిధిలోని శూలగిరి నార్త్ యూనియన్ బేరికైలో వివిధ అభివృద్ధి పనులకు డీఎంకే నాయకులు భూమి పూజ చేశారు. శూలగిరి నార్త్ యూనిట్ డీఎంకే కార్యదర్శి నాగేశ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వై ప్రకాశ్ పనులకు శ్రీకారం చుట్టారు. బేరికై మారుతి నగర్‌లో రూ.8.14 లక్షలతో మురుగునీటి కాలువ, సులకుంట గ్రామంలో రూ.3 లక్షల అంచనా వ్యయంతో మురుగునీటి కాలువ నిర్మాణం, రూ.10 లక్షల అంచనా వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు, కురుబరపల్లి గ్రామంలో సుమారు రూ.20 లక్షల అంచనా వ్యయంతో 30వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించనున్నారు. హోసూరు తూర్పు యూనియన్ డీఎంకే కార్యదర్శి లోకేశ్‌రెడ్డి, బేరికై పంచాయతీ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్‌తో సతమతం

హోసూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నగరానికి అన్ని వైపులా అసౌకర్యం కలిగిస్తున్న ట్రాఫిక్‌రద్దీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. హోసూరు నగర ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ కారణంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు, కర్మాగారాలకు వెళ్లే కార్మికులు, ప్రభుత్వ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల రాకపోకలు నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు తప్పనిసరి: డీహెచ్ఓ

బళ్లారి సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లపైబడిన ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని, జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్ బాబు అన్నారు. శుక్రవారం సండూరు తాలూకా విఠలాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన తర్వాత ఆయన ప్రజలతో మాట్లాడారు. ఎవరికైనా నోరు పొడిబారడం, ఎటువంటి కారణం లేకుండా అలసట అనిపిస్తే వారు వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్ష చేయించుకోవాలన్నారు. 30ఏళ్ళ నుండి 59 సంవత్సరాల వయస్సు గల వారిలో అత్యధిక మరణాలకు అంతులేని వ్యాధులే కారణమన్నారు. 2026నాటికి దేశంలో 75మిలియన్ల మంది మధుమేహ వ్యాధి గ్రస్థులుండే అవకాశం ఉందని, ఇది పని వయస్సులో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. మధుమేహం గురించి ఎఫ్‌బీఎస్, పీపీబీఎస్ పరీక్ష, భోజనం చేసిన 2గంటల తర్వాత పరీక్ష చేయడం వల్ల శరీరం యొక్క షుగర్ స్థాయి తెలుస్తుందన్నారు. ఇది మనం తీసుకునే ఆహారంపై ఆధార పడి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్నిఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన వారు సద్వినియోగం చేసు కోవాలన్నారు. వాకింగ్, సైక్లింగ్ ద్వారా బరువును నియంత్రించ వచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య వెల్నెస్ కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు మధుమేహం, రక్తపోటు పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఉచింతంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా వైద్య అధికారులు డాక్టర్ హరీష్, డాక్టర్ మహేశ్, ఆసుపత్రి సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేస్తున్నడీ హెచ్ఓ రమేశ్‌బాబు

ఉత్సాహంగా ప్రతిభా కారంజి పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న తాలుకా ఏడీ మల్లన్నగౌడ





బాలరాముడు, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

కంప్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలంటే ప్రతిభా కారంజి కార్యక్రమాలు ఎంతో అవసరమని తాలుకా పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లన్నగౌడ అన్నారు. శుక్రవారం కంప్లి పట్టణంలో కమ్మవారి విజయ నగర ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సత్యనారాయణ పేట క్లస్టర్ ఏర్పాటు చేసిన ప్రతిభా కారంజి పోటీలను కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో రాణించాలన్నారు. పోటీలతో విద్యార్థులు ఉత్సాహం, ఆసక్తి పెరుగుతుందన్నారు. సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. సన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న నాని అనే విద్యార్థి శ్రీకృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు.చేతన్ విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న డి శ్రావ్య అయోధ్య రాముడు వేశభూషణలతో పూర్తిగా ఆకట్టుకుని గుర్తింపు పొందారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు,సుజాత, నాగన్న గౌడ, హనుమంతప్ప, రేవన్న, శివరాజ్, రేవణ్ణ, సిద్దేష్, రేణుక, సావిత్రిబాయి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నారా సూర్యనారాయణ రెడ్డి జన్మదిన వేడుకలు

బళ్లారి సిటీ, డిసెంబరు 5: మాజీ ఎమ్మెల్యే, కేపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు నారా సూర్యనారాయణరెడ్డి 72వ జన్మదినవేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నరు. బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్ , గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు నాయకత్వంలో ఏపీఎంసీ మార్కెట్లో రైతులకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు సూర్య నారాయణ రెడ్డి నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో అభిమానులు వేడుకలు జరుపుకున్నారు.



రోగులకు పాలు పండ్లు పంపిణీ చేస్తున్న హోస్కోటే జగదీష్

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

కంప్లి (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకుడు నారా సూర్యనారాయణరెడ్డి 72వ పుట్టిన రోజు సందర్భంగా అభిమాని హోస్కోటి జగదీష్ నేతృత్వంలో కంప్లి సముదాయ ఆస్పత్రిలో రోగులకు పాలు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణప్ప, గంగాధర గౌడ, బలే మల్లికార్జున, లింగప్ప, నాగరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు భోజనం వడ్డిస్తున్న మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, సురేశ్‌బాబు

అధికారులు సహకరించాలి: ఎమ్మెల్యే



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాలుకా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం సిరుగుప్ప తాలుకా పంచాయతీ భవనంలో ప్రగతిపరిశీలన సభ జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలుకాలో తాగునీరు, వ్యవసాయం, రోడ్ల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం తాలుకాలోని కర్చిగనూరు గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ. 2.75 కోట్ల రూపాయల వ్యయంతో 11 గ్రామాలలో ఈ నిర్మాణ పనులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా పంచాయతీ ఈవో, పవన్‌కుమార్, గ్యారెంటీ పథకాల అధ్యక్షుడు మారుతీ వరప్రసాద్ రెడ్డి, మాంతేష్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలయ్య అభిమానుల నిరాశ

సిరుగుప్ప, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అఖండ-2సినిమా విడుదల కాకపోవడంతో నందమూరి బాలకృష్ణ అభిమానులకు నిరాశే మిగిలింది. నందమూరి బాలకృష్ణ అభిమానులు అఖండ-2 సినిమాను వీక్షించేందుకు ఉత్సాహంగా వుండగా నిర్మాణ సంస్థ ప్రీమియర్ షో అనంతరం సినిమా విడుదలను వాయిదా వేయడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. 4వ తేదీ రాత్రి నుంచి 5వ తేదీ ఉదయం వరకు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. నిర్మాణసంస్థ సమస్యలతో ప్రదర్శన రద్దు చేసి మరో తేదీ ప్రకటిస్తామని తెలపడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. రాత్రంతా ఎదురు చూసి వెనుదిరిగిపోయారు.

కోలాచలం విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

బళ్లారి సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్వర్గీయ కోలాచలం వెంకటరావు విగ్రహం, నామఫలకాలను ఏర్పాటు చేయాలని కోలాచలం విశ్వప్రకాశ్ నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్ళిన బ్రాహ్మణ సంఘ నాయకులు కోలాచలం బళ్లారికి చేసిన వివిధ సాహిత్య సాంస్కృతిక సహకార సేవలు గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఈసందర్భంగా అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. శ్రీనాథ్, అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీశ్ దేశాయ్, సిమెంట్ గిరిప్రసాద్, నేమకల్ రావు, మంజునాథ్‌భట్, ప్రకాశ్, శ్రీనాథ్,బాదనహట్టి రఘునందన, రఘు, సమర్థ్, గిరి, హరి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భరత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్వప్రకాశ్ తదితరులు